పోస్టర్ ఆవిష్కరణ

ఇల్లెందు:పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, గుండాల: పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇల్లెందు, జూన్ 15: ఆపరేషన్ కగార్ ఆపాలన్న డిమాండుతో ఈ నెల 17న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ-ఎంఎల్ (న్యూడెమోక్రసీ) నాయకులు ఎండి.రాసుద్దీన్, కొక్కు సారంగపాణి చెప్పారు. ఈ కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఆదివారం ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో అఖిలపక్ష సమావేశంలో ఆవిష్కరించారు. ఈ మహాధర్నాను ప్రజలంతా జయప్రదం చేయాలని కోరారు. అఖిలపక్ష నాయకులు కొప్పుల శ్రీనివాస్, బొగ్గరపు రాజు, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, చందావత్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్‌లో..

ఇల్లెందు రూరల్, జూన్ 15: ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఈ నెల 17న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నా వాల్ పోస్టర్‌ను మండలంలోని పోచారం గ్రామంలో సీపీఐ-ఎంఎల్ (న్యూడెమోక్రసీ) నాయకుడు మోతీలాల్ ఆదివారం ఆవిష్కరించారు. నాయకులు తుడుం శ్రీను, రాజు, భూక్యా లక్ష్మ, కోటు, మల్సూర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుండాలలో..

గుండాల, జూన్ 15: ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని కోరుతూ శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ ఇందిరా పార్కువద్ద జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీతో వెంటనే శాంతి చర్చలు జరుపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తెల్లం భాస్కర్, టీ రాము, గడ్డం రమేశ్, గంగాధర నగేశ్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమక్రసీ నాయకులు, కొమరం సీతరాములు, అరెం నరేశ్, పర్శిక రవి, వజ్జ యర్రయ్య, సీపీఐ నాయకులు వాగబోయిన రమేశ్, గడ్డం శ్రీను, కాంగ్రెస్ నాయకులు ఈసం పాపారావు, అబ్దుల్ నబీ పాల్గొన్నారు.

శాచ్యురేషన్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలం, జూన్ 15: ఆదివాసీ గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధార్తి అభజాన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ శ్యాచురేషన్ క్యాంపులు గిరిజన కుటుంబాలు, కొండరెడ్ల గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 30వ తేదీవరకు గిరిజనుల వికాసానికి సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి అమలుచేస్తున్న ఈ పథకం కింద జిల్లాలోని ఐటీడీఏ పరిధిలోగల 19 మండలాలను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఈ క్యాంపుల్లో ఆధార్, కులధృవీకరణ, ఓటర్, రేషన్, కిసాన్ క్రెడిట్, కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్, ఆర్‌వోఎఫ్ఆర్, జన్‌దన్, ఎన్ఆర్ఈజీఎస్ తదితర వాటిని అర్హులకు అందించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో జరిగే సదస్సులకు ఎంపీడీవోలు ప్రత్యేక చొరవ చూపి పంచాయతీ సహకారంతో గోడలకు వాల్‌పోస్టర్లు అంటించి ప్రచారం చేయాలన్నారు. ఈ పథకంలో గుర్తింపు కార్డులు అర్హులందరికీ అందేలా చర్యలు చేపట్టాలన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

ఇల్లెందు రూరల్, జూన్ 15: సింగరేణి కొత్తగూడెం ఏరియాకు బదిలీ అయిన ఇల్లెందు ఏరియా డీజీఎం జీవీ మోహన్‌రావును జీఎం కృష్ణయ్య ఆదివారం తన కార్యాలయంలో సన్మానించారు. ఎస్‌వోటూజీఎం రామస్వామి, అధికారులు తదితరులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా ఎన్‌టీపీపీ నుంచి బదిలీపై డీజీఎంగా అజ్మీర తుకారాం వచ్చారు.

టీబీజీకేఎస్ సన్మానం..

మణుగూరు టౌన్, జూన్ 15: మణుగూరు ఏరియా నుంచి శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీపై వెళ్తున్న సంక్షేమ అధికారి ఓంకారి బాపును టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సత్కరించారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంక్షేమ అధికారులు అందించే సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో బంగారి పవన్‌కుమార్, మస్తాన్, మడ్డి రాము, పద్దం శ్రీనివాస్, గుగులోత్ రమేశ్, గఫూర్, బిక్షపతి, ఇమ్రాన్, బడే హరీశ్ పాల్గొన్నారు.

బషీర్‌కు 'రేగా' నివాళి

బషీర్ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న రేగా

అశ్వాపురం, జూన్ 15: అశ్వాపురం గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ మాజీ మండల అధ్యక్షుడు షేక్ బషీర్ గుండెపోటుతో శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదివారం బషీర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబసభ్యులకు సంతాపం, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నివాళి అర్పించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, మాజీ మండల అధ్యక్షుడు కందుల కృష్ణార్జునరావు, నాయకులు కంచుగట్ల వీరభద్రం, షేక్ నయీమ్ ఉన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత

ఇల్లెందు రూరల్, జూన్ 15: సింగరేణి ఇల్లెందు ఏరియాలో కారుణ్య నియామక పత్రాలను జీఎం కృష్ణయ్య ఆదివారం తన కార్యాలయంలో అందజేశారు. ఎస్‌వో టు జీఎం రామస్వామి, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, కార్మిక నాయకులు యాదగిరి, లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

PLOT FOR SALE

★ కొమరవెల్లి కొండపోచమ్మ గుడి దగ్గరలో 150 Sq.yds. ప్లాట్ 6 లక్షలు మాత్రమే. 60 రోజులలో ఫుల్ అమౌంట్ పే చేసిన వారికి 5 గ్రామ్స్ గోల్డ్ & రిజిస్ట్రేషన్ ఫ్రీగా చేయబడును. ఫ్రీ సైట్ కాల్ మీ. 8919302962 / 7702925337.

NT-347052

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

భద్రాచలం, జూన్ 15: బస్సులో సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో స్టేషన్ మేనేజర్ ఆ మహిళకు ఫోను అందజేసిన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. పెద్దపల్లికి చెందిన పాఠకుల రిషిత భద్రాచలంలో కొత్తగూడెం వెళ్లేందుకు బస్సు ఎక్కింది. ఆమె ఆమె కొత్తగూడెంలో దిగి బస్సులో సెల్ మరిచిపోయింది. బస్సులో ఉన్న ప్రయాణికునికి సెల్‌ఫోన్ దొరకడంతో స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావుకు అందజేశారు. ఆ ఫోన్‌లో నెంబర్ల ఆధారంగా ఎవరి ఫోనో తెలుసుకుని భద్రాచలం వచ్చి సెల్‌ఫోన్ తీసుకోవాలని చెప్పారు. రిషిత బస్టాండ్‌కు వచ్చి స్టేషన్‌మేనేజర్ కలవడంతో సెల్‌ఫోన్‌ను అప్పగించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

'గూడెం'.. పద్మవ్యూహం!

- జిల్లా కేంద్రంలో వాహనాల రద్దీతో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తం
- ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్ కాకపోవడంతో నిత్యం తిప్పలు
- ఎస్సై స్థాయి అధికారులతోనే కొనసాగుతున్న ట్రాఫిక్ నిర్వహణ
- కొత్తగూడెం, పాల్వంచలోనూ అధికారులు, సిబ్బందిని కేటాయించాలి

ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న డీఎస్పీ (ఫైల్)

కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జూన్ 15: జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో వాహనాల రద్దీతో ట్రాఫిక్ వ్యవస్థ పద్మవ్యూహంలా మారింది. వాహనాల రాకపోకలకు అనుగుణంగా పోలీసు అధికారులు తరచూ ట్రాఫిక్ సవరణలు చేస్తున్నా.. పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై స్థాయి అధికారులే ఉండడంలో సమస్యలను అధిగమించడం వారికి తలకుమించిన భారంగా మారింది. సింగరేణి కార్పొరేట్ ఏరియాలతో పాటు కేటీపీఎస్, జెన్‌కో, వ్యాపార, వాణిజ్య రంగాలకు సముదాయంగా ఉన్న కొత్తగూడెం పట్టణం తాజాగా మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. నియోజకవర్గంలో సుమారు 2.5 లక్షలపైనే జనాభా ఉండగా.. కార్పొరేషన్‌గా అవతరించిన తర్వాత కొత్తగూడెం-పాల్వంచ-సుజాతనగర్ పరిధిలో విభజించిన అధికారిక ఓటర్ల సంఖ్య 1.30 లక్షలపైనే ఉంది. ఈ నేపథ్యంలో కొత్తగూడెం పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతూనే ఉన్నాయి. ఇల్లెందు, ఖమ్మం, విజయవాడ, భద్రాచలం ప్రాంతాలకు కొత్తగూడెం కేంద్రంగా ఉండడం.. జాతీయ, రాష్ట్రీయ రహదారులకు అనుసంధానంగా ఉండడంతో నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. కొత్తగూడెం జిల్లా కేంద్రంగా ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తి కావొస్తుండడం.. ఇటీవల కార్పొరేషన్‌గా రూపాంతరం చెందిన నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలపై సంబంధిత అధికారులు, పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ట్రాఫిక్ పీఎస్ అప్‌గ్రేడ్ అయ్యేనా?

కొత్తగూడెం-పాల్వంచ మున్సిపాలిటీలతోపాటు సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామాలను విలీనం చేయడంతో కార్పొరేషన్‌గా అవతరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అధికారులు కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని వార్డులను జనాభా ప్రాతిపదికన విభజించి 60 డివిజన్లుగా ప్రతిపాదించారు. కొత్తగూడెంలో 29 డివిజన్లు, పాల్వంచలో 27 డివిజన్లు, సుజాతనగర్‌లో 4 డివిజన్లు కలుపుకొని మొత్తం 60 డివిజన్లు ఏర్పాటు కానున్నాయి. అయితే కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లో పోలీస్ అధికారులు ఎన్ని ప్రణాళికలు రూపొందించినప్పటికీ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. అయితే ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత కూడా ఇందుకు కారణమని చెప్పొచ్చు. ఇదిలా ఉండగా.. ఇప్పటివరకు కొత్తగూడెం జంట పట్టణంగా పిలువబడిన పాల్వంచ పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ వ్యవస్థ లేకపోవడం కొసమెరుపు. ప్రస్తుతం పాల్వంచ సైతం కొత్తగూడెం కార్పొరేషన్‌లో విలీనం కావడంతో ట్రాఫిక్ వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని నియమించి, కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు ట్రాఫిక్ ఎస్సైలను కేటాయిస్తే ట్రాఫిక్ సమస్యలకు చెక్ పడే అవకాశాలు లేకపోలేదు. ప్రస్తుతానికి చుంచుపల్లి హౌసింగ్ బోర్డు మొదలు లక్ష్మీదేవిపల్లి క్రాస్ రోడ్డు వరకు ట్రాఫిక్ పోలీసులు వాహనాల రవాణా వ్యవస్థను సమస్యలు లేకుండా అదుపు చేస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసి ఇన్‌స్పెక్టర్‌ను, పాల్వంచలో సైతం ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బందిని కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'రైతు భరోసా'పై అన్నదాతల్లో అయోమయం

- వానకాలం పంట సాగుపై రైతన్నల ఉరుకులు...పరుగులు
- సగం మందికే అందిన రైతుభరోసా

పత్తి వేసేందుకు అచ్చు తోలుతున్న రైతు

దుమ్ముగూడెం, జూన్ 15: రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల కన్నెర్ర చేస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎకరాకు రూ.7,500లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్నదాతకు యాసంగికి రూ.6వేలు మాత్రమే ఇచ్చింది. అది కూడా సగం మంది రైతుల ఖాతాల్లో జమ చేయడంతో అన్నదాతలు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. మండలంలో 43వేల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగుచేస్తున్నారు. వానకాలం పంట సాగు ప్రారంభమవుతున్నా నేటికీ రైతుభరోసా ప్రభుత్వం నుంచి అన్నదాతలకు అందకపోవడంతో పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో యాసంగి పంటకు మండలంలో మూడున్నర ఎకరాలకు మాత్రమే రైతుభరోసా అందింది. మిగిలిన రైతులకు నేటివరకు భరోసా అందలేదని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో మొత్తం 15,721 మంది రైతులు ఉండగా రూ.23,37,15,364లు రైతు భరోసా అందించాల్సి ఉండగా 12,674 మందికి రూ.13,18,73,996 నగదును మాత్రమే యాసంగి సీజన్‌కు రైతుల ఖాతాల్లో జమచేశారు. మరోపక్క వానకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ గత యాసంగి సీజన్ పెట్టుబడికోసం రైతులు ఎదురుచూడడం హాస్యాస్పదంగా మారింది. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి సీజన్‌కు మాటిచ్చినప్పటికీ ఆ మాట ప్రకారం రైతు అకౌంట్లలో నగదు జమ అయ్యేవని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం పెట్టుబడి సాయం సకాలంలో బ్యాంకు ఖాతాల్లో జమకావడంలేదని అన్నదాతలు చెబుతున్నారు. వానకాలం పంటల సాగు ముమ్మరంగా సాగడంతో పెట్టుబడుల కోసం రైతులు వడ్డీవ్యాపారులను సైతం ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం చెప్పిన విధంగా రైతుభరోసా వారి ఖాతాల్లో జమచేస్తే రైతుల వానకాలం పంటకు మేలు జరుగుతుంది.

సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుదారులకు ఇబ్బందులు

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

చెక్కులు ఇస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం అర్బన్, జూన్ 15: సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుదారులకు కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల వారు ఇబ్బందులపాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పథకంపై ఆయా ఆస్పత్రుల నిర్వాహకులకు ఎలాంటి అవగాహన లేకపోవడమే కారణమని అన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు 84 మందికి చెక్కులను ఆదివారం కొత్తగూడెంలోని తన క్యాంప్ కార్యాలయంలో అందించారు. ఆయన మాట్లాడుతూ.. పేదలందరికీ సీఎంఆర్ఎఫ్ అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విద్యాసంస్థల్లో సకల సదుపాయాలకు కృషి

కొత్తగూడెం గణేష్ టెంపుల్/లక్ష్మీదేవిపల్లి. జూన్ 15: కొత్తగూడెం నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో, వసతి గృహాల్లో సకల సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చెప్పారు. మండలంలోని రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పంచాయతీరాజ్ నిధులతో చేపట్టనున్న భవనాల మరమ్మతులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతంపై దృష్టి సారించామన్నారు. ప్రిన్సిపాల్ పద్మ, విద్యుత్ శాఖ ఏఈ రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకం దారుల కమిటీ ఎన్నిక

పర్ణశాల, జూన్ 15: గొర్రెలు, మేకల పెంప కం దారుల సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బచ్చలకూర వీరస్వామి, నల్లగొర్ల ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా అంగిరేకుల నాగరాజు, బొల్లి రామకృష్ణ, కొండా కృష్ణబాబు, కందుల నర్సింహారావు ఎన్నికయ్యారు. ఆదివారం మండలంలోని సున్నంబట్టి గ్రామంలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లి సత్యనారాయణ మాట్లాడారు. ప్రభుత్వం గొర్రెల సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం అవుతున్నందున గొర్రెలకు అనేక రోగాలు వచ్చే అవకాశం ఉన్నందున మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో బంటు శ్రీను, మేకల వీరబాబు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా ఎక్సైజ్ చెక్‌పోస్టు

భద్రాచలంలోని ఎక్సైజ్ చెక్‌పోస్టు

భద్రాచలం, జూన్ 15: గంజాయి, గుడుంబాతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా రాష్ర్టాల నుంచి నిత్యం అక్రమ రవాణా జరుగుతుండడంతో వాటిని నియంత్రించాల్సిన భద్రాచలంలోని ఎక్సైజ్ చెక్‌పోస్టు అలంకార ప్రాయంగానే మిగిలింది. భద్రాచలంలో బ్రిడ్జి వద్ద ఈ ఎక్సైజ్ చెక్‌పోస్టును ఏర్పాటు చేయగా ఇక్కడ సీఐ స్థాయి, ఇతర కానిస్టేబుళ్లతో నిత్యం పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా అందుకు భిన్నంగా చెక్‌పోస్టు మారింది. పేరుకే చెక్‌పోస్టు ఉంది తప్ప ఇక్కడ మాత్రం ఏ అధికారి కూడా పూర్తిస్థాయిలో విధులు నిర్వహించడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం కొద్దిసేపు మాత్రమే అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారే తప్ప పూర్తిస్థాయిలో విధులు నిర్వహించడం లేదు. ఇప్పటికైనా ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్పందించి ఈ చెక్‌పోస్టు వద్ద నిత్యం అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

'మలేరియా' గ్రామంలో వైద్య శిబిరం

అశ్వారావుపేట రూరల్, జూన్ 15: మండలంలోని మలేరియా ప్రభావిత గ్రామమైన రెడ్డిగూడెంలో వైద్య శిబిరాన్ని వినాయకపురం పీహెచ్‌సీ డాక్టర్ రాందాస్ ఆదివారం నిర్వహించారు. ఇటీవల ఈ గ్రామంలో మలేరియా జ్వరంతో ఒకరు మృతి చెందారు. ఈ నేపథ్యంలో, ఇంటింటికీ వెళ్లి రక్త పరీక్షలు చేశారు. ముగ్గురు జ్వర పీడుతులకు చికిత్స చేశారు. సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం మురికిగుంతల్లో దోమల నివారణకు మందు చల్లారు.

వర్షాలకు ముందే పనులు పూర్తి చేయాలి

మనుగూరు టౌన్, జూన్ 15: వర్షాలకు ముందే పూడికతీత పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సింగరేణి సీఎస్ఆర్ కింద రూ.60 లక్షల నిధులతో చేపట్టిన మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కోడిపుంజుల వాగు పూడిక తీత పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. గతేడాది వర్షాకాలంలో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 5,278 కేసులు పరిష్కారం: ఎస్పీ

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జూన్ 15: జిల్లాలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో వేల సంఖ్యలో కేసులు పరిష్కారమైనట్లు ఎస్పీ రోహిత్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదై పోలీస్ ఇన్వెస్టిగేషన్, కోర్టు విచారణలో ఉన్న 5,278 కేసులు పరిష్కారమైనట్లు చెప్పారు. అందులో పోలీస్, కోర్టు విచారణలో ఉన్నవి 803 కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఎంవీ యాక్ట్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులు 4,009, ఈ-పెట్టి కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన తదితర కేసులు 466 ఉన్నట్లు వివరించారు. గత వారం రోజులుగా పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది కేసులో ఉన్న కక్షిదారులను స్వయంగా కలిసి రాజీమార్గంపై అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. అదే విధంగా జిల్లాలో నమోదైన 226 సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరించి ఇందులో ఉన్న సుమారు రూ.60 లక్షల పైగా నగదును కోర్టు ద్వారా బాధితులకు అందజేసినట్లు వివరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

మణుగూరు టౌన్, జూన్ 15: ముఖ్యమం త్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.4.10 లక్షల చెక్కులను పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం అందజేశారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలం, జూన్ 15: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఉద యం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు. గిరిజనులు తమ సమస్యలను లిఖితపూర్వకంగా అందజేయాలన్నారు.

నేటి 'ప్రజావాణి' రద్దు

కొత్తగూడెం టౌన్, జూన్ 15: కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన 'ప్రజావాణి'ని రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సోమవారం రైతులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడతారని, జిల్లా అధికారులంతా పాల్గొంటారని పేర్కొన్నారు. అధికారులెవరూ అందుబాటులో ఉండని కారణంగా 'ప్రజావాణి'ని రద్దు చేసినట్లు కలెక్టర్ వివరించారు. దీనిని ప్రజలు గమనించాలని, అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావద్దని కోరారు.

నేడు 'రైతు నేస్తం'

దమ్మపేట రూరల్/అశ్వారావుపేట రూరల్/టేకులపల్లి, జూన్ 15: రైతు నేస్తం కార్యక్రమం సోమవారం రైతు వేదికల్లో జరగనుంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడతారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు పాల్గొంటారు. దమ్మపేట మండలంలోని మల్లారం, గండుగులపల్లి, పట్వారిగూడెం, అశ్వారావుపేట మండలంలోని అశ్వారావుపేట, నారాయణపురం, టేకులపల్లి మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్, ప్రెగళ్లపాడు, బోడు రైతు వేదికల్లో ఈ కార్యక్రమం ఉంటుంది. ఏవోలు చంద్రశేఖర్ రెడ్డి (దమ్మపేట), శివప్రసాద్ (అశ్వారావుపేట), అన్నపూర్ణ (టేకులపల్లి) వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. రైతులంతా హాజరుకావాలని వారు కోరారు.

నేడు రెవెన్యూ సదస్సు

అశ్వారావుపేట రూరల్, జూలై 15: మండలంలోని వినాయకపురం పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్ఐ పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం, జూన్ 15: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చకులు అర్చన జరిపారు. అంతరాలయంలోని ధ్రువమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్య బలిహరణం, నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఆహ్వానం

భద్రాచలం, జూన్ 15: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నాల్గోవ తరగతి చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ క్రీడా పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈవో తోటమళ్ల రమ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీన మండలంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో క్రీడా పాఠశాలలో పోటీలు నిర్వహిస్తామని, పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో tgss.telangana.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపా రు. రిజిస్ట్రేషన్ ప్రింట్‌ను తీసుకుని 18వ తేదీ ఉదయం 9 గంటలకు భద్రాచలంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హాజరుకావాలన్నారు.

చర్ల..

చర్ల, జూన్ 15: ప్రభుత్వ క్రీడాపాఠశాలల్లో నాల్గోవ తరగతి చదువుతున్న విద్యార్థుల ఎంపిక ప్రక్రియను ఈ నెల 18న నిర్వహించనున్నట్టు ఎంఈవో పరిటాల వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ వివరాలను అన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నమోదు చేసిన వివరాల ప్రింట్‌ను 18వ తేదీ ఉదయం 9:00 గంటలకు చర్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే ఎంపిక పాల్గొనాలని ఎంఈవో కోరారు.

టేకులపల్లి..

టేకులపల్లి, జూన్ 15: స్పోర్ట్స్ స్కూల్ 4వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడిందని ఎంఈవో జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని క్యాంప్ ఇన్‌చార్జిలంతా విద్యార్థులతో tggss.telangana.gov.in లో రిజిస్ట్రేషన్ చేయించాలని కోరారు. ఈ నెల 18వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు.

ఏఎస్‌పీ జిల్లా కమిటీ ఎన్నిక

పాల్వంచ, జూన్ 15: ఆదివాసీ సంక్షేమ పరిషత్(ఏఎస్‌పీ) జిల్లా నూతన కమిటీని పాల్వంచలో ఆదివారం జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా వాగబోయిన చంద్రయ్య దొర, ప్రధాన కార్యదర్శిగా నూప సీతయ్య, గౌరవాధ్యక్షుడిగా రేసు ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా గడ్డం వెంకటేశ్వర్లు, పాయం రమేశ్, బట్టు కనకరాజు, కార్యదర్శులుగా రాజశేఖర్, వెంకటేశ్వర్లు, విజయ్ రాం, నాగేశ్వరరావు, ప్రసాద్, శ్రీను, బాలు, నాగేంద్రబాబు, నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.

ట్రాలీ ఆటో బోల్తా ..నలుగురికి గాయాలు

బూర్గంపహాడ్, జూన్ 15: ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాలీ ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడడంతో నలుగురికి గాయాలైన ఘటన ఆదివారం మండలంలోని లక్ష్మీపురంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపురం ఏపీ గోడౌన్ సమీపంలో ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాలీ ఆటో పల్టీకొట్టింది. ట్రాలీలో ఉన్న సమ్మయ్య, నాని, నాగరాజు, నర్సయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు సమీపంలోని మోరంపల్లిబంజర్ పీహెచ్‌సీకి తరలించారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

దమ్మపేట, జూన్ 15: విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి, సత్తుపల్లి మండలంలోని ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నది. ఈ నెల 2న కళాశాలకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు అన్నిచోట్ల గాలించినప్పటికీ ఆచూకీ దొరకలేదు. ఆమె తండ్రి ఫిర్యాదుతో దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది.

కలివేరులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న స్థానికులు

చర్ల, జూన్ 15: మండలంలోని కలివేరు గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో కల్లూరి సమ్మయ్యకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలోని సామన్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.